# చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తాం





**రాష్ట్ర మంత్రి గడ్డం వివేకానంద**

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** రైతుల వద్ద నుంచి చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. గురువారం చెన్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, తహశీల్దార్ మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ పెద్దింటి పద్మ, వైస్ చైర్‌పర్సన్ వినయ్ కుమార్‌లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేస్తోందని తెలిపారు. చివరి గింజ వరకు కొనుగోలు చేయడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు పేర్కొన్నారు. వేసవి ఉష్ణోగ్రతలు, ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల కారణంగా హమాలీల కొరత ఉన్నప్పటికీ రోజుకు 150 లారీల ధాన్యం తరలిస్తున్నామని తెలిపారు. అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని త్వరగా ఆరబెట్టి రైస్ మిల్లులకు తరలించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ సూచనల మేరకు గోదాములను అద్దెకు తీసుకుని ధాన్యం నిల్వ చేసేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రైతు భరోసా, రైతు బీమా, రుణమాఫీ వంటి పథకాల ద్వారా ప్రభుత్వం రైతు సంక్షేమానికి కృషి చేస్తోందని పేర్కొన్నారు. సన్నరకం వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాలుకు రూ.500 బోనస్ అందిస్తున్నట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ రైతులకు నష్టం కలగ కుండా నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేసి, నగదు నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తున్నామని అన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ఉదయం, సాయంత్రం వేళల్లో కొనుగోలు ప్రక్రియ కొనసాగిస్తున్నామని చెప్పారు. జిల్లాలో 1.83 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అనంతరం చెన్నూర్ మున్సిపల్ కౌన్సిలర్లతో పట్టణ అభివృద్ధి పనులపై మంత్రి సమీక్ష నిర్వహించారు. రహదారి విస్తరణ, మురుగు కాలువల నిర్మాణం, పారిశుద్ధ్య నిర్వహణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. అభివృద్ధి పనుల్లో ఎవరికీ నష్టం కలగ కుండా చర్యలు తీసుకుంటామని, స్థలం కోల్పోయిన వారికి షాపింగ్ కాంప్లెక్స్‌లో దుకాణాలు కేటాయించడంతో పాటు టిడిఆర్ ద్వారా వెసులుబాటు కల్పిస్తామని తెలిపారు. అనవసర పుకార్లను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలి


- **మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కొండా సురేఖ**
- **రాష్ట్ర స్థాయి మెగా రైతు మేళా ప్రారంభం**

**ఉద్యమ కెరటం, హనుమకొండ:** ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా హన్మకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణంలో రాష్ట్ర స్థాయి మెగా రైతు మేళా ఈనెల 5 నుంచి 7వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతికతను చేరువ చేయడం ఈ మేళా ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. మేళాలో మూడో రోజు గురువారం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మేళాలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను సందర్శించి ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సదస్సులో అతిథులు పంటల వైవిధ్యీకరణ, ప్రత్యామ్నాయ పంటల సాగు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, రైతు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. సాంకేతికతను వినియోగించి దిగుబడులు పెంచుకోవాలని రైతులకు సూచించారు. సభను ఉద్దేశించి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ మూడు రోజుల రైతు మేళా




రైతుల్లో కొత్త ఆలోచనలను తీసుకువచ్చిందని తెలిపారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని సూచించారు. రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. రైతు రుణమాఫీ, సన్నబియ్యం పంపిణీ వంటి పథకాలను ప్రస్తావిస్తూ ప్రతిపక్షాల విమర్శలను ఆయన ఖండించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కె.ఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు తదితర ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్ర మోహన్, హార్టికల్చర్ డైరెక్టర్ యాస్మిన్ బాషా, హనుమకొండ, వరంగల్ జిల్లా కలెక్టర్లు చాహాత్ బాజ్ పాయి, డాక్టర్ సత్య శారద, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, ఇతర అధికారులు, రైతులు హాజరయ్యారు.





# అగ్నిప్రమాదంలో పంట నష్టపోయిన రైతును ఆదుకోవాలి

**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** అగ్ని ప్రమాదంలో జొన్న పంట కాలిపోయి నష్టపోయిన మండలంలోని సావర్గాం గ్రామానికి చెందిన రైతు పేరమండ్ల చిన్నయ్యకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని గ్రామ సర్పంచ్ కళ్యాణి మహేందర్ కోరారు. బుధవారం సాయంత్రం అనుకోని రీతిలో అగ్నిప్రమాదానికి గురై పంట పూర్తిగా కాలిపోయిందని, చేతికొచ్చిన పంట కళ్ల ముందేబూడిద కావడంతో రైతు కన్నీరు మున్నీరవుతున్నాడని తెలిపారు. ఈ విషయాన్ని స్థానిక తహశీల్దార్, వ్యవసాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, గురువారం ఆర్ఐ నాగోరావ్, ఏఈఓ, జీపీఓ ఘటనా స్థలానికి చేరుకుని కాలిపోయిన పంటను పరిశీలించి నష్టాన్ని అంచనా వేసి పంచనామా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రైతు చిన్నయ్య ఎంతో కష్టపడి సాగు చేసిన పంట చివరి దశలో అగ్నికి ఆహుతి కావడం అత్యంత బాధాకరమని అన్నారు. సుమారు 20 నుంచి 30 క్వింటాళ్ల జొన్న పంట నష్టం వాటిల్లిందని తెలిపారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించి బాధిత రైతుకు తక్షణమే పూర్తి స్థాయి నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లఖంపూర్ సర్పంచ్, స్థానిక గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.



# వైద్యరంగం బలోపేతం దిశగా ప్రభుత్వం చర్యలు

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ప్రభుత్వం వైద్య రంగాన్ని బలోపేతం చేసే దిశగా అనేక చర్యలు చేపడుతోందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం చెన్నూర్ మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనులను మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన, వేగవంతమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటోందని చెప్పారు. చెన్నూర్‌లో వంద పడకల ఆసుపత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు ద్వారా వైద్య సేవలు మరింత విస్తరించనున్నాయని తెలిపారు. నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని, పనులను త్వరగా పూర్తి చేసేలా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. గుత్తేదారులతో సమన్వయం చేసుకుని పనుల్లో వేగం పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**ప్రజాపాలన ద్వారా రైతులకు సోలార్ పంపుసెట్లు పంపిణీ**




**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని కల్లూరు మున్సిపాలిటీ చైర్మన్ మోహన్ నాయక్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల ద్వారా ఖమ్మం జిల్లా కల్లూరు మండలంలో రైతులకు సోలార్ పంపుసెట్లు అందజేస్తున్నట్లు తెలిపారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. విద్యుత్ సమస్యలను అధిగమించేందుకు, సాగునీటి సౌకర్యాలను మెరుగుపర్చేందుకు సోలార్ పంపుసెట్లు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. రైతులు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు రైతులకు ఎంతో మేలు చేస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# తాంసి పీఏసీఎస్ చైర్మన్‌గా తిరిగి బాధ్యతల స్వీకరణ

- **అడ్డి భోజా రెడ్డి, ధనుంజయ్, దాసరి రమేష్‌లకు ఘన సన్మానం**




**ఉద్యమ కెరటం, తాంసి:** రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ల పదవీ కాలాన్ని పొడిగిస్తూ ఇటీవల వెలువరించిన తీర్పుతో తాంసి మండల కేంద్రంలో సందడి నెలకొంది. ఈ తీర్పు నేపథ్యంలో తాంసి సహకార సంఘం చైర్మన్‌గా అడ్డి భోజా రెడ్డి, వైస్ చైర్మన్ ధనుంజయ్, డైరెక్టర్ దాసరి రమేష్‌లు గురువారం తిరిగి తమ బాధ్యతలను స్వీకరించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం వారికి పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అనుభవజ్ఞులైన పాలకవర్గం తిరిగి బాధ్యతలు చేపట్టడంతో రైతులకు మరింత మెరుగైన సేవలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. చైర్మన్ అడ్డి భోజా రెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమమే తమ ప్రధాన ధ్యేయమని తెలిపారు. సహకార సంఘం ద్వారా అందే రాయితీలు, రుణాలు అర్హులైన రైతులకు సకాలంలో అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# గండ్రత్ సుజాత ఆశన్నను సన్మానించిన బోరంచు



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** తెలంగాణ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మాజీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత ఆశన్నను ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సుజాత ఆశన్న నివాసంలో ఆయనను కలిసిన శ్రీకాంత్ రెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించారు. మార్కెట్ కమిటీ అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేస్తానని ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. అనంతరం గండ్రత్ సుజాత ఆశన్న మాట్లాడుతూ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రీకాంత్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకమైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మావల సర్పంచ్ శేఖర్, రాజేశ్వర్, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

